క్లుప్తంగా

రెండు షాపులపై కేసు


స్వీట్‌షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

సీతమ్మధార : నగరంలోని సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాల్లోని స్వీట్ షాపులు, హోటళ్లు, కిరాణా దుకాణాల్లో జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ గోవిందు, తహసీల్దార్ ఎం.రమేష్ తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ (సర్కిల్–2) ఎస్.గోవింద్, సహాయ కార్మిక అధికారి (సర్కిల్–10) పి.విజయకుమార్, సహాయ కార్మిక అధికారి (సర్కిల్–9) విజయ్ పాల్గొన్నారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30గంటలకు బాలభోగం, 9.30గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మాధవుడ్ని తాకిన సూర్య కిరణాలు


సూర్య కిరణాల కాంతిలో శ్రీ లీలా మాధవస్వామి

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార ఆలయంలో కొలువైన శ్రీ లీలా మాధవస్వామిని శనివారం ఉదయం సూర్యకిరణాలు నేరుగా తాకాయి. అక్కడ దర్శనం చేసుకునేందుకు వచ్చిన భక్తులు స్వామిని సూర్యకిరణాలు తాకడం నేరుగా చూసి పులకించిపోయారు. మాఘమాసం చివరిలో ఫాల్గుణ మాసం ప్రారంభంలో ప్రతి ఏడాది సూర్యకిరణాలు స్వామిని తాకుతాయని ఆలయ అనువంశిక అర్చకుడు రవీంద్రకుమార్ తెలిపారు. మాధవ నామస్మరణతో ఆలయం మార్మోగింది. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

బాబాపు సేవా సంఘం తొలి సమావేశం


సమావేశంలో పాల్గొన్న బాబాపు సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార: ఇటీవల ఏర్పడిన బాబాపూ సేవా సంఘం సలహా మండలి తొలి సమావేశం శనివారం ఉదయం సంఘం కార్యాలయ ప్రాంగణంలో అధ్యక్షులు అంతర్వేది అధ్యక్షతన జరిగింది. తొలుత కార్యదర్శి రమణి నివేదిక సమర్పించారు. సేవా సంఘం కార్యక్రమాలు విస్తృతపరచాలని నిర్ణయించారు. అలాగే పేద బాలలు, తల్లులకు ఆరోగ్య శిబిరాలు, బ్లాక్ పెయింటింగ్ క్లాస్‌లు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని తీర్మానించారు. నిధులు సేకరించి నూతన కార్యక్రమాలు చేపట్టాలని పలువురు సభ్యులు సూచించారు. కార్యదర్శి రమణి వందన సమర్పణ చేశారు. ఈ సమావేశంలో సలహా మండలి సభ్యులు ఆచార్య వి.బాల మోహన్‌దాస్, నరవ ప్రకాశరావు, చల్లా మహాలక్ష్మి, అవసరాల శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కామేశ్వరరావు, డాక్టర్ మురళీరావు, ఉషారెడ్డి, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు.. గుండె గుభేలు


వరాహగిరికాలనీలో శిథిలమైన డ్రైనేజీ

- కనీస సదుపాయాలకు నోచుకోని వరాహగిరికాలనీ, సత్యసాయినగర్
- పాఠశాల, ఆస్పత్రి, అంగన్‌వాడీ దేనికీ నోచుకోని స్థానికులు
- శుభకార్యాలు చేసుకుందామంటే సామాజిక భవనమూ కరవే


జీవీఎంసీ 45వ వార్డు పరిధిలోని వరాహగిరికాలనీ


సత్యసాయినగర్‌లో వాడుకలో లేని పాత సామాజిక భవనం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస వసతులు అందుబాటులో లేవు. ఈ ప్రాంత ప్రజలు కొన్ని దశాబ్దాలుగా ఉన్న సదుపాయాలతోనే కాలం గడుపుతున్నారు. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతున్నా, ఈ ప్రాంతాల్లో మాత్రం చాలా అలస్యంగా పనులు జరుగుతాయి. అవి కూడా కొన్ని మాత్రమే. వార్డు పరిధి సింగాలమ్మపురం, సింహగిరికాలనీ, సత్యసాయినగర్, వరాహగిరికాలనీ–1, వరాహగిరికాలనీ –2 ప్రాంతాల్లో నివసించే వారికి కనీసం ప్రభుత్వ బడి, ప్రభుత్వ ఆస్పత్రి కూడా అందుబాటులో లేవు. ఏ కష్టం వచ్చినా నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీహెచ్‌కు వెళ్లాలి. లేదంటే వేలకు వేలు ఖర్చుపెట్టి ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరగాలి. ఇక పేదలకు విద్యనందించే ప్రభుత్వ బడులయితే వార్డులో అస్సలు లేనే లేవు. ప్రభుత్వ పాఠశాలకు చేరాలంటే హైవే దాటాలి. లేదా మురళీనగర్ వైపు మూడు, నాలుగు కిలోమీటర్లు వెళ్లాలి. ఈ బాధలు పడలేక కొందరు ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయిస్తుంటే, మరి కొందరు చదువులు మానేసి పనులు వెతుక్కుంటున్నారు. గతంలో వార్డులో గల ఏకైక ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల అయిన పోర్టు స్కూల్‌ను మూసేశారు. దీంతో పేదలకు చదువులు సైతం దూరం అయ్యాయి.

కానరాని అంగన్‌వాడీ..

ఈ కాలనీల్లో కనీసం అంగన్‌వాడీ సదుపాయం కూడా లేదు. దీంతో పలువురు తల్లులు తమ చిన్నారులను తాటిచెట్లపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్తున్నారు. సింహగిరికాలనీలో బాల్యం భవనం ఉండేది. అది శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో దీనిని మార్చారు. కానీ ఈ భవనం స్థానంలో మరో భవన నిర్మాణం చేపట్టడం కానీ, వసతులు కల్పించడం కానీ చేయలేదు. గతంలో కూడా దీనిపై అధికారులకు విన్నవించినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ కాలనీవాసులకు కనీసం సామాజిక భవన సదుపాయం కూడా లేదు. వివాహాలు, ప్రత్యేక కార్యక్రమాలు అయినా సరైన సదుపాయం లేదు. దీంతో రోడ్డుపైన, లేదా ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలోనే కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు.

సత్యసాయినగర్, వరాహగిరికాలనీ–1,2లో కొన్ని చోట్ల ఇటీవల రోడ్లు, డ్రైనేజీలు వేశారు. కానీ వరాహగిరికాలనీ–2లో మాత్రం ప్రధాన డ్రైనేజీలు, మెట్ల మార్గాలు చాలా అధ్వానంగా, ప్రమాదకరంగా ఉన్నాయి. దశాబ్దాల క్రితం వేసిన డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పెద్ద పెద్ద రంధ్రాలు పడి కాలు వేస్తే కాలువలో పడే విధంగా ఉన్నాయి. ఇటువంటి చోట్ల కనీసం పైకప్పు కూడా లేకపోవడంతో స్థానికులే తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక మెట్ల మార్గాలు కూడా అలానే ఉన్నాయి. తమ ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వరాహగిరికాలనీలో కాలు వేస్తే కాలువలో పడే విధంగా ఉన్న ప్రమాదకర డ్రైనేజీ

రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు దగా



నిరసన వ్యక్తం చేస్తున్న డీహెచ్‌పీఎస్ నేతలు

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులకు అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్)రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాటాకీస్ రోడ్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో ఈ సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3.25 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిందని, అందులో జనాభా ప్రాతిపదికన చూస్తే రూ.45 వేల కోట్లు ఎస్సీలకు, 22 వేల కోట్లు ఎస్టీలకు కేటాయించాలన్నారు. దానికి విరుద్ధంగా ఎస్సీలకు 10 వేల 900 కోట్లు, ఎస్టీలకు 4 వేల 307 కోట్లు కేటాయించి దగా చేశారన్నారు. దళితులకు ఇంకా 35 వేల కోట్లు కేటాయించాల్సి ఉందన్నారు. భూమి కొనుగోలు, విదేశీ విద్యా పథకం, కులాంతర వివాహాల ప్రోత్సాహంపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. సూపర్ సిక్స్ పథకంలో నిరుద్యోగ భృతి ఉందని, దాని కోసం దళిత యువత ఎదురు చూస్తున్నటికీ ప్రభుత్వం నుంచి సానుకుల స్పందన లేదన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో సమ న్యాయాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి దళిత యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజులు, జి.రాంబాబు, జిల్లా నాయకులు మధు, కిషోర్, ప్రసాద్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


బుల్లయ్య కళాశాల వద్ద విద్యార్థుల సందడి


బీవీకే కళాశాల వద్ద విద్యార్థుల నిరీక్షణ

సీతంపేట: ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫైనల్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉత్తర నియోజకవర్గం పరిధిలో పలు కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మొదటిరోజు సెకెండ్ లాంగ్వేజ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది.

విద్యార్థులు 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంతో ఆయా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. 8.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. సీతంపేట పరిధిలో బుల్లయ్య కళాశాల, బీవీకే కళాశాల, శ్రీవిశ్వ కళాశాల, చైతన్య కళాశాలలో ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద నిరీక్షిస్తూ కనిపించారు.


బుల్లయ్య కళాశాల వద్ద హాల్ టికెట్ నంబరు చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రింటర్లు పని చేయవు.. సర్టిఫికెట్లు రావు

ఇదీ సచివాలయాల దుస్థితి


సీతమ్మధార సచివాలయంలో పని చేయని ప్రింటర్

సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో గల పలు సచివాలయాల్లో ప్రింటర్లు పడకేశాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జీవీఎంసీ పరిధి 14వ వార్డు సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో గల సచివాలయంలో నెలల తరబడి ప్రింటర్లు పని చేయకున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలు నిర్వీర్యం అవుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. వాస్తవానికి సచివాలయాల్లో జారీ చేసే కుల, ఆదాయ, కుటుంబ ధ్రువపత్రాల ప్రింట్లు ఇవ్వాల్సి ఉంటుంది. కాని ప్రింటర్లు పని చేయకపోవడంతో సచివాలయం సిబ్బంది సర్టిఫికెట్ల వెనుక స్టాంపు వేసి సంతకాలు చేసి బయట నెట్ సెంటర్‌లో ప్రింట్ తీసుకోండంటూ సర్టిఫికెట్లను వాట్సాప్ రూపంలో పంపుతున్నారని పలువురు వాపోతున్నారు. ఈ విషయంలో కొందరు సిబ్బందితో వాగ్వాదాలకు దిగుతున్నారని సమాచారం. రేసపువానిపాలెం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో గల సచివాలయాల్లో కూడా ప్రింటర్లు పని చేయని దుస్థితి నెలకొంది. జోనల్ కార్యాలయం సిబ్బంది స్పందించకపోవడంతో ప్రింటర్ల మరమ్మతులకు చేతి చమురు వదులుతోందని సచివాలయం సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. దీంతో ఉన్నత తరగతుల్లో చేరాలంటే కులం, ఆదాయం తదితర ధ్రువపత్రాలు ఎంతైనా అవసరం. దీంతో తల్లిదండ్రులు ముందు జాగ్రత్తగా సచివాలయాల్లో ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. తీరా అక్కడ ప్రింటర్లు పని చేయడం లేదని తెలిసి నిరాశగా ఇంటర్నెట్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్–3 అధికారులు స్పందించి సచివాలయాల్లో ప్రింటర్లకు మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

గైస్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం


సమావేశంలో మాట్లాడుతున్న కెమ్‌దోసా గౌరవాధ్యక్షుడు పీవీ రంగారావు

మురళీనగర్: కెమికల్ ఇంజినీరింగు ఇన్‌స్టిట్యూట్ (గైస్) అభివృద్ధికి కెమికల్ ఇంజినీరింగ్ డిప్లమా పూర్వ విద్యార్థుల సంఘం (కెమ్‌దోసా) సంపూర్ణ సహకారం అందిస్తుందని సంఘం గౌరవాధ్యక్షుడు పీవీ రంగారావు తెలిపారు. కెమ్‌దోసా 9వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. కాలేజీలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అనేక సదుపాయాల కల్పనలో సహాయం అందించినట్లు చెప్పారు. గైస్‌లో విద్యనభ్యసించిన ప్రతి పూర్వ విద్యార్థి తాము చదువుకున్న కాలేజీ రుణం తీర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా గైస్‌లోని నాలుగు బ్రాంచ్‌ల్లో ప్రతిభా వంతులైన విద్యార్థులకు రూ.1.30 లక్షల బహుమతులను కెమ్‌దోసా తరుపున అందించారు. కెమ్‌దోస అధ్యక్షుడు ఏ.వరహాలు, కోఆర్డినేటర్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు ప్రసంగించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ సమక్షంలో 2025–2027 సంవత్సరానికి కెమ్‌దోసా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ రెండేళ్లపాటు పదవిలో ఉంటుంది. గౌరవాధ్యక్షుడిగా పీవీ రంగారావు, అధ్యక్షుడిగా టి.బాలకృష్ణారావు, కార్యదర్శిగా వైవీ తారక్, కోశాధికారిగా ఎల్.బుల్లి రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎ.సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎస్. జానీబాషా, కార్యవర్గ సభ్యులుగా బి.గోవిందరావు, ఎ.ఉదయ్ తేజ, టి.నర్సింగరావు, జె.శంకరరావు, కోఆర్డినేటర్లుగా డాక్టర్ బీవీ లక్ష్మణరావు, కేబీవీఎస్ఎస్ కుమార్ ఎన్నికయ్యారు.

కనుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


తిరువీధి మహోత్సవం నిర్వహిస్తున్న భక్త బృందం

సీతమ్మధార: సీతమ్మధార గురువాయురప్పన్ శ్రీ కృష్ణ మందిరం వద్దగల ఫంక్షన్ హాల్లో శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ సారథ్యంలో లోక కల్యాణార్థం శ్రీ భూనీలా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శృతిలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్ శారదా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముందు తిరువీధి మహోత్సవం (పల్లకి సేవ) ఘనంగా జరిగింది. అనంతరం తిరువీధి మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కల్యాణంలోని మధుర ఘట్టాలను వివరించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవ కమిటీ సభ్యులు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం: కంచరపాలెం ఇందిరానగర్–5లో తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్న ఎం. అజయ్ సంపత్ సాయి (26) ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన శనివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అజయ్ సంపత్ సాయి బీటెక్ చదువుకున్నాడు. ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ఇతని తండ్రి నారాయణమూర్తి బొలేరో వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నారు. అలాగే తల్లి గాజువాకలో ఓ ట్రావెల్స్ సంస్థలో పని చేస్తున్నారు. ఇతనికి ఓ సోదరి కూడా ఉంది. ఆమెకు వివాహం అయి అత్తవారింట్లో ఉంటోంది. శనివారం అజయ్ తల్లిదండ్రులిద్దరూ విధులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం సుమారు 1.30 ప్రాంతంలో తండ్రి నారాయణమూర్తి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు వేసి ఉన్నాయి. ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో తలుపు పగులగొట్టి చూడగా అజయ్ ఇంట్లో బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా 20 రోజుల క్రితం తన చిన్నాన్న కుమారులిద్దరూ రాంబిల్లి బీచ్‌లో స్నానానికి వెళ్లి మృత్యువాత పడ్డారు. అప్పటి నుండి అజయ్ ఒంటరిగా ఉంటూ మనస్తాపం చెంది మానసికంగా బాధపడుతూ ఉన్నాడు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు చెబుతున్నారు. అతని తల్లి లీలారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళా పోలీసులకు వైద్య సేవలు

విశాఖ సిటీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో డీసీపీ (క్రైమ్) లతా మాధురి ఆధ్వర్యంలో శనివారం పోలీస్ కల్యాణ మండపంలో అపోలో ఆస్పత్రి వైద్య బృందంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 220 మంది మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పరీక్షలు చేసుకున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల ఉత్తర నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్‌రాజు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. జీవీఎంసీ 44వ వార్డుకు చెందిన ఎం. గాయత్రికి రూ. 20 వేలు, 47వ వార్డుకి చెందిన కోరుబిల్లి దేవికి రూ. 25,600, మాధవ బోయిన వరుణ్ సందేశ్‌కి రూ. 50 వేలు అందజేశారు. అలాగే 25వ వార్డుకు చెందిన అప్పి బాబుకి రూ. 66,700, జామి జయదీప్ నందన్‌కి రూ. రెండు లక్షల 50 వేల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం జనసేన కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, నాయకులు వెంకటేష్, ఆశీర్వాదం సుజాత, బీజేపీ, టీడీపీ, జనసేన వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ సోమనారాయణ

తాటిచెట్లపాలెం: రాబోయే స్వచ్ఛసర్వేక్షణ్‌లో నగరానికి ప్రథమ ర్యాంక్ కోసం కృషి చేయాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ (పబ్లిక్ హెల్త్) ఆర్ సోమనారాయణ తెలిపారు. శనివారం జీవీఎంసీ పరిధి రైల్వేన్యూకాలనీ, సుబ్బలక్ష్మీనగర్‌లోని సుబ్బలక్ష్మీ కళ్యాణ మండపంలో స్వయం సహాయక గ్రూప్ సభ్యులకు, శానిటేషన్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పౌరుడితో స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ చేయించాలని, దీని ద్వార నగరాన్ని ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ (జోన్–5) బి.రాము, ఏఎంఓహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్, శానిటేషన్ సెక్రటరీ జనార్దన్, ఏపీడీలు పుణ్యవతి, కృపానందం, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సిఓలు, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా వంటల పోటీలు


విజేతలను ప్రకటిస్తున్న న్యాయనిర్ణేతలు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో 60 మంది మహిళలు పాల్గొన్నారు. అటుకులతో తయారు చేసిన స్వీట్స్, హాట్ వంటకాలను మహిళలు ప్రదర్శించారు. హోటల్ మేనేజ్‌మెంటు నిపుణులు అబ్దుల్ ముజాహిద్, దువ్వాడ లక్ష్మీభార్గవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్నవారిలో అరుణ, చంద్రిక, నాగేశ్వరి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. ఎం.పార్వతి, ఎ.పద్మలతలను కన్సొలేషన్ బహుమతులకు ఎంపిక చేసినట్లు అధ్యక్షురాలు కె.మాధవి చెప్పారు. విజేతలకు బహుమతులు ఈనెల 5న నిర్వహించనున్న మహిళా దినోత్సవంలో అందిస్తామని. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.కమల, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు


నడక పోటీలో పాల్గొన్న మహిళలు

మురళీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భాగంగా మాధవదార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు నాలుగు విభాగాల్లో నడక పోటీ లు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలను వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఫిన్ వెస్కో బ్యాంక్ మేనేజర్ వీవీ గణపతి ప్రారంభించారు. 31–40 ఏళ్లు, 40–50, 51–60 ఏళ్లు, 60 ఏళ్ల వయసు పైబడిన మహిళలను ప్రత్యేక విభాగాలుగా ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించారు. ఈ నాలుగు విభాగాల నుంచి మొదటి మూడు స్థానాలకు 12 మంది మహిళలను విజేతలుగా ఎంపిక చేశారు. అనంతరం మ్యూజికల్ చెయిర్ పోటీ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా వీరికి బహుమతులు అందిస్తామని అధ్యక్షురాలు కె.మాధవి, కార్యదర్శి పి.కమల చెప్పారు.

రోడ్డుకు అడ్డంగా చెట్టు కొమ్మ


శ్రీనగర్‌లో డే అంట్ నైట్ హాస్పిటల్ రోడ్‌లో విరిగిన చెట్టు

సీతంపేట: స్థానిక రామాటాకీస్ సమీపంలో శ్రీనగర్‌లో డే అంట్ నైట్ హాస్పిటల్ రోడ్‌లో చెట్టు కొమ్మ విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. నాలుగు రోజులుగా రోడ్డుకు అడ్డంగా ఉన్నా దానిని తొలగించే నాథుడు కరువయ్యాడు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. రామాటాకీస్ రోడ్ నుంచి ద్వారకానగర్‌కు వెళ్లే రోడ్ కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అటువంటి మార్గంలో చెట్టు విరిగి పడినా యంత్రాంగం నేటికీ స్పందించకపోవడంపై స్థానికులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.